# అమరుడు కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి 43 వ వర్ధంతి సభలు



కామ్రేడ్ టి.ఎన్ వర్ధంతి సభ-అనంతపురంలో ప్రసంగిస్తున్న చాగరి మల్లిఖార్జునరెడ్డి; ఒంగోలు సభలో ప్రసంగిస్తున్న కా॥ఝాన్సీ

**అనంతపురం:** 2019 జులై 28 న అనంతపురం లలితకళా పరిషత్ భవనంలో కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి 43వ వర్ధంతి సభను జరిపి అనంతపురం జిల్లా సి.పి.ఐ (ఎం-ఎల్) కామ్రేడ్ టి.ఎన్‌కు ఘనంగా నివాళులు అర్పించింది. ఈ సభకు సి.పి.ఐ ఎం-ఎల్ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ సి.పెద్దన్న అధ్యక్షత వహించారు. కామ్రేడ్ పెద్దన్న తన అధ్యక్షో పన్యాసంలో కామ్రేడ్ టి.ఎన్ జీవితము, రాజకీయాలను వివిధ సంఘర్షణలలో ఆయన నిర్వహించిన పాత్రను గుర్తు చేసారు.మూడుసార్లు ఎం.ఎల్.ఏగా, ఒక మారు ఎం.పిగా చట్ట సభలలో ప్రజావాణిని వినిపించిన తీరును, నిరంతరం ప్రజల మధ్య ఉండి ప్రజలను ఉద్యమాలలోకి నడిపించిన తీరును వివరించారు. 1969లో ఎంఎల్ఏగా రాజీనామా చేసి విప్లవ కమ్యునిస్టు ఉద్యమాన్ని నిర్మిస్తూ అరస్టయి జైలులో ఉండి "తాకట్టులో భారతదేశం"ను కోర్టు స్టేట్‌మెంట్‌గా ప్రకటించారని చెప్పారు. కామ్రేడ్ నాగిరెడ్డి తో ఆయనకు గల అనుబంధాన్ని గుర్తు చేసుకొన్నారు. తరువాత "చాగనూరు, సిరివార నీటిపారుదల, భూరక్షణ పోరాట సమితి (బళ్ళారి)" నాయకులు చాగనూరు మల్లిఖార్జునరెడ్డి మాట్లాడుతూ కామ్రేడ్ టి.ఎన్ అకళంక దేశభక్తి, విప్లవ నిబద్ధతలను కొనియాడారు. ఆయన క్రమశిక్షణకు మారురూపమని ప్రశంశించారు. దేశ ప్రజల విముక్తికై తపించి,పోరాడిన మహా విప్లవ నాయకుడు నాగిరెడ్డి గారి దారిలో నడవడమే మన కర్తవ్యం అని ముగించారు. "కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు" ఛైర్మన్ కామ్రేడ్ సూర్యసాగర్ ప్రసంగిస్తూ 50 ఏళ్ళ క్రితం నాగిరెడ్డి గారు చేసిన రాజకీయ విశ్లేషణ, ఆయన నడిపిన విప్లవ పోరాటాలు నేడు మరింత సంగతంగా వున్నాయన్నారు. భూస్వామ్య, సామ్రాజ్యవాద దోపిడీ పీడనలు మరింత ఉద్‌ృతమైనాయని అన్నారు. ఇంకా రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు కామ్రేడ్ చంద్రశేఖర్, ఏ.ఐ.ఎఫ్.టి.యు (న్యూ) నాయకులు రహంతుల్లా ఖాన్ నాగిరెడ్డి క ృషిని స్మరిస్తూ ప్రసంగించారు. ఈ సభకు ముందు రైతు,కూలీ, కార్మిక, ప్రజాసంఘాలకు చెందిన వందలాది మంది అనంతపురం టవర్ క్లాక్ వద్ద నున్న కామ్రేడ్ నాగిరెడ్డి విగ్రహం వద్దకు చేరి నివాళులు అర్పించారు.కామ్రేడ్ నాగిరెడ్డిని, అమరులను స్మరిస్తూ పాటలు పాడారు.

**ఒంగోలు** : ప్రకాశంజిల్లా ఒంగోలులో 28-7-19న మల్లయ్యలింగం భవన్‌లో కామ్రేడ్ కారుమంచి సుబ్బారావు అధ్యక్షతన కామ్రేడ్ నాగిరెడ్డి 43వ వర్ధంతి సభ జరిగింది. ఈ సభలో ప్రధానోపన్యాసం చేసిన రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ నాగిరెడ్డిగారు జీవించినది 59 సంవత్సరాలే అయినా అప్పటికి కమ్యునిస్టు ఉద్యమ ప్రతి మలుపు ఆయన జీవిత చరిత్రలో కనిపిస్తాయని చెప్పారు.సి.పి.ఐ ,సి.పి.ఎంల కాలంలో గొప్ప పార్లమెంటేరియన్‌గా విస్తృతంగా కృషి సాగించినా, ఆ అసెంబ్లీలనే బాతాఖానీ షాపులని బయటకు వచ్చినా అన్ని సమయాలలో విప్లవ ప్రజా ఉద్యమ ప్రయోజనాలే తన ఆలోచనలుగా జీవించారని చెప్పారు. నేటి రాజకీయ వ్యవస్థలో నీతి నిజాయితి గురించి చెప్పే బి.జె.పి కర్ణాటకలో ఎంతటి నీచమైన పనులకు పాల్పడుతోందో వివరించారు. బి.జె.పి పాలనలో ప్రజాధనాన్ని దిగమింగి,లక్షల కోట్లు బ్యాంకులకు ఎగవేసిన వాళ్ళు విదేశాలకు వెళ్ళి హాయిగా ఉంటుంటే వేలాది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకొంటున్న పరిస్థితిని వివరించారు. మరోపక్క ఆదివాసులను అడవులనుంచి గెంటివేయాలని చూస్తున్నారని తెలిపారు. రాష్టంలో వైఎస్ఆర్ పార్టీ, తెలుగుదేశంలు ఒకరి నొకరు విభేదించినట్లు కనిపిస్తాయని కానీ పార్లమెంటులో సమాచార హక్కు చట్టం విషయంలో కేంద్రం ప్రవేశ పెట్టిన అప్రజాస్వామిక చట్ట సవరణలకు కలసి ఓటేసారని అన్నారు. చివరగా ప్రజా ఉద్యామాల నిర్మాణమే నేటి అవసరమని, దాని కోసం క ృషి చేయడమే కామ్రేడ్ నాగిరెడ్డికి ఇచ్చే నివాళి అని ముగుంచారు, అనంతరం సి.పి.ఐ.(ఎం-ఎల్) ప్రకాశం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ డి.వి.ఎన్ స్వామి మాట్లాడుతూ కామ్రేడ్ నాగిరెడ్డి ఆనాడు చెప్పినవి నేడు అందరూ అంగీకరించాల్సినవిగా మారుతున్నాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం బి.ఎస్.ఎన్ ఎల్ నుంచి రైల్వే, ఎయిర్ ఇండియా వంటి 46 ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీ కరించే పేర బడా పెట్టుబడిదారులకు కట్టబెట్ట చూస్తున్నదని వివరించారు. కార్మిక చట్టాల సవరణ పేర కార్మికులు పోరాడి సాధించుకొన్న హక్కులను కుదించి,నామమాత్రం చేసే విధంగా దాడి జరుగుతున్నాయని చెపుతూ ఐక్య ఉద్యమాలే దీనికి పరిష్కారం అని చెప్పి ముగించారు.ఈ సభలో రైతు కూలీ సంఘం ప్రకాశం జిల్లా కార్యదర్శి ఎస్.లలితకుమారి, ప్రజాతంత్ర మేధావుల వేదిక జిల్లా కన్వీనర్ పి.గోవిందయ్య, ఏ.ఐ.ఎఫ్.టి.యూ (న్యూ) రాష్ట్ర నాయకులు ఎం.ఎస్.సాయి తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమం మొదట కామ్రేడ్ నాగిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి అందరూ నివాళులు అర్పించారు.

ooo